# శ్రీమద్రామాయణము

## గేయ కావ్యము

రచన:
"కళాసరస్వతి", "నాటక కళాప్రపూర్ణ"
ధూళిపాళ
సీతారామశాస్త్రి
రంగస్థల, సినీ నటులు

శ్రీరామ

శ్రీహనుమాన్

# కిష్కింధా కాండము

శ్రీరామ లక్ష్మణులు - చింతవీడి నెమ్మనమున
భారమంత పరమాత్ముని - పైనుంచి నిశ్చలముగ
వరశరముల నిషుధినుంచి - కరముల మేల్విండ్ల బూని
ఋష్యమూకమునకు బోవ - నెంచుచున్నవారి గాంచి 1

కొండపైని సుగ్రీవుడు - కొందలంబు నెడదనొంది
యతివేషమ్మున వార - లన్నపనుప వచ్చిరంచు
భీతి మీఱ నర్కసూతి - యాతురముగ పరుగులిడుచు
మలయ మహీధరమునకు - మంత్రులు స్నేహితులతోడ 2

విషయంబుల గ్రహియించి - వేవేగను తనకుదెలుప
ఆతడంపె హనుమంతుని - యావీరుల చేరువకు,
దూకె హనుమ కొండనుండి - దోర్బల శౌర్యంబు మెఱయ
కొండరాళ్ళన్ని యపుడు - పిండిపిండియయిపోయె 3

వీరాధి వీరుఁడు - వేదాంత వేద్యుడు
భక్తిజ్ఞాన వైరాగ్య - భావనిబిడ చిత్తుడు
పటుతరమౌ ప్రభుభక్తికి - ప్రబలమైన రూపుడు
ఆగమాంత సారమును - అపోసానమునుబట్టి 4

సామవేద గానమును - సంపూర్తిగ నభ్యసించి
మోక్ష సామ్రాజ్యమునకు - మూలమైన గట్టిసామి
నవవ్యాకరణవేత్త - నవయుగంపు చతుర్ముఖుడు
భిక్షుకుని రూపమున - విచ్చేసి హనుమానుడు 5

చేతంబున భక్తిపొదల - జేమోడ్పును సంధించి
"అర్కసూను మంత్రి వరుఁడ - నాంజనేయుడందురు నన్ను
సుగ్రీవుని యాజ్ఞదాల్చి - సుభగుల మిముగనగ వచ్చితి
అధిపులార యెవ్వరు మీ? - రాకకు కారణమేమ"న 6

"అయోధ్యపురి వసియించెద - మతిలోకవీరులము
దశరథుని తనయులము - తండ్రియాజ్ఞ తలధరించి
కాననముల కేతెంచిన - కర్మకరణ దక్షులము
నా నామము సౌమిత్రి - నా యన్న యీ శ్రీరాముఁడు 7

అడవులందు దిరుగుచుండ - నన్నపత్నిసీతమ్మను
అసురుడొక్కఁడపహరించె - నఘమని మదినెంచబోక
ఆమెకొఱకు నలమటించి - యరణ్యములఁరోయుచుండ
చెంచెతమ్మ శబరిచెప్పె - చెలువగు సుగ్రీవు ఘనత 8

ఇచ్చటికే వచ్చితిమి - యినపుత్రుని సఖ్యమునకు"
అనుచు దెలుప లక్ష్మణుం - డంజనాతనూజుతోడ,
వారినమ్మి హనుమంతుడు - వదలి భిక్షుకుని రూపము
ఇమ్ముగ వారిద్దఱగొని - ఋష్యమూకాద్రినిలిపి 9

పినిన వృత్తమంతయు దా - వేజని హరిపతికి దెలుప
రయమున రవిజుండువచ్చి - రామలక్ష్మణుల కడకు
పాదయుగము పూజసేసి - ప్రణుతించి ముమ్మాఱు
స్వామి! మీదర్శనమున - సఫలము నాజన్మమనుచు 10

పలుకుల పిరితేనెలూఱ - కులుకుఁగనుల ప్రేమమీఱ
జగమంతటి మనసుచేసి - జానకీపతికిజెప్పె
అసువులొడ్డియైనగాని - యవనిజాత దెత్తునంచు
పలుమాఱులు బలికిరాము - పాదమంటి బాసజేసి 11

ఇల్లుపెడలదన్నినాడు - నిల్లాలినిరుమహరించి
రాజ్యపదభ్రష్టుజేసె - రామయ్యా, నన్ను వాలి
ఎట్టులైనవానినిపుడె - కిట్టినాకు రాజ్యమిమ్ము
నిన్ను నమ్మియున్నవాఁడ - నన్నుతాంగయనివేడుచు 12

చదలనేగు చవనిజాత - జాఱవిడచిన తొడవులన్ని
లలిదెచ్చి సుగ్రీవుఁడు - రాముకరములందునుంచె
జానకిరవణమ్ములన్ని - మానుగదానెఱిగినట్టి
రాముకనుల నీరునిండె - ప్రేమమోము చిందులాడ 13

మాటరాక నోటినుండి - గాటమైన గాసిగూర
జానకీయంచు నఱచె - జలదరింప నొడలంతయు
తెప్పటిల్లి శ్రీరాముడు - తెప్పున నిజతేజమొప్ప
సీదుపైరి వాలిగెడపి - నిన్నురాజొనర్తునన 14

సీతమ్మ చనినజాడ - జెప్పిభానుసూనుఁడు
వివరింపగ రావణుకథ - విశదంబుగ నాతనితో
రాముడుగ్రరూపుండై - రక్తసిక్త నయనమ్ముల
"హరిహరాదు లడ్డమైన - నవని సింగి యేకమైన 15

సప్తజలధులింకినను - క్షణమాత్రన పొంగినను
ముక్కంటియె ముందునిలచి - మోహరమున మార్కొన్నను
చతుర్ముఖుఁడె వలదన్నను - సఖులతోడ చుట్టలతో
దానవనాధుని రావణు - తలలు పదియుద్రెంతు"ననుడు 16

సౌమిత్రిని, శ్రీరాముని, - శాంతపఱచి సుగ్రీవుడు
అవనీరుహశాఖపైన - నందఱగూర్చుండబెట్టి
వంతమోమునందుజింద - వాలికి దనకునుగల
వైరవిధంబంతయును - వాకొనె దానిక్కరణిని 17

అసురుడైన మాయావి - యర్ధరాత్రి యొకనాడు
గావుకేకలిడుచువచ్చి - కయ్యమునకు గాల్దువ్వగ
బవరమునే వలదన, నా - పలుకులు పెడచెవినిబెట్టి
రణముసేయనాతనితో - రయమున దాసిద్ధమయ్యె 18

తోడుగా నేనుగూడ - తోడ్తోడన బయలుదేఱ
???
మమ్ముగాంచి భయమందిన - మాయావి పాఱిపోయి
కొండయందునున్న యొండు - గుహలోనికి బోయినక్క,
అసురు జంపివచ్చువఱకు - యచ్చట నన్నుండమని 19

పిడువక నాయన్నవాలి - వేగమె తాదూరె గుహను

ఘోరరణము జరుగుచుండె - కొండబొరియలోన నొకట
ఒకవర్షము వేచియుండ - నోపికతోనన్న కొఱకు
వట్టొడ్డెను గుహనుండి - బలముగ పెనురక్తనదులు 20

రక్కసు కేకలు వీనుల - రంధ్రములన్ బగులగొట్ట
అన్నమడిసె నంచుదలచి - యారక్కసి రాకుండగ
ఆ బిలమున కడ్డముగా - నప్పుడె యొక గుండునెట్టి
అపరకర్మ లొనరజేసి - యడలుచు నేసిల్లుజేర 21

మంత్రులు, సామంతులెల్ల - మహీధవుని నన్ను జేయ
నాయన్నగు వాలివచ్చి - నాభార్యనురుమనుగూడి
వెడల నడుప నన్ను దన్ని - వేగమె నేసిచటజేరి
క్షణమొక్క యుగముగా - కంటిధారనుంటినని 22

అంజలించివేఁడ తనదు - నెంజలి బోగొట్టుమంచు
దయాజలధి రఘురాముఁడు - ధైర్యపు వచనములజెప్పి
శిష్టరక్షణమ్ముజేసి - దుష్టశిక్షణమ్ముజేతు
వాలివీర తేజమణచి - వాని బాహుబలమునొంచి 23

నీ రాజ్యము నీకుగూర్తు - నీసతి నీకిత్తునంచు
మతిబోయిన సుగ్రీవుని - ధృతిమంతుని జేయుటకై
చేతశరాసనమూని - చెచ్చెర సజ్యమ్మొనర్చి
నేలగూల్చి తానుసప్త - సాలంబుల నొకేకోల 24

ఇఁకబోఁదగు రణమునకని - యినసూనుని బురిగొల్పగ
ఉప్పొంగిన రవిసూనుడు - ఉరుకులిడెను కిష్కింధకు
నెవ్వలనను భీతిల్లక - చివ్వకుజీరెను వాలిసి

వారిద్దఱకును నచ్చట - తీరనియుద్ధంబు జరిగె 25

ఒకేరూపులైనవారి - నొప్పుగ గుర్తించలేక
సందియమ్ము నెమ్మదిలో - సందడింప దండడిగా
డాగియున్న శ్రీరాముఁడు - తాబాణము పిడువకుండె
తాళలేక సుగ్రీవుఁడు - పైళమురికె నద్రిపైకి 26

రామాదులు నచటికేగ - రవిసూనుడు వగగుందుచు
నీవలననె చెడితినంచు - దావలవని మాటలాడ
బాణము సంధింపపీలు - పడమి దెలిపి రామమూర్తి
కంఠంబున గుఱుతుగాగ - గజపుష్పపు మాలవైచి 27

మరలబోయి ధైర్యముతో - మార్కొను నీయన్నతోడ
ఈమాటే గురుతుబట్టి - యిలపై బడగూల్తువాలి
ననుచుబలుక రామచంద్రు - డాత్మనమ్మి యినజుడఱిగె
తెంపరియై యన్నతోడ - తీవ్రముగా రణమొనర్ప 28

చెట్టుమొదట దాగియున్న - శ్రీరాముని గనిభీపిడి

తోరంబుగ గర్జించుచు - తొడజరచెను సుగ్రీవుడు
శుద్ధాంతగతుడువాలి - సూర్యసుతుని గర్జనవిని
క్రోధదుర్నిరీక్ష్యుడౌచు - గొబ్బుననసిజేయ వెడల 29

తారవచ్చి బోవలదని - దారికి నడ్డముగ నిలిచి
అపశకునంబుల నీనా - డధికంబుగ గంటిననియు
రామలక్ష్మణుల సాయము - రవిపుత్రునకబ్బెననియు
బవరమాప మేలటంచు - బలువిధముల వేడినను 30

దుర్మదమున తారపలుకు - దురదృష్టుడు చెవిజేర్పక
దుర్నీతుల వల్లించుచు - దురమొనరుపబోయె వాలి
ముష్టిఘాతములతోను - మోకాల్మొమ్మలతోను
తాళ వృక్షజాలముతో - తద్దపెద్దబండలతో 31

జరుగు ద్వంద్వయుద్ధములో - సొరుగనుండ సుగ్రీవుడు
కరుణాకరుడురు తేజుఁడు - కౌసల్యకుమారుడొక్క
భల్లంబును వడిపిడిచెను - బాగుమీఱ, గుఱి జూచి
వాలినోట మాటలేక - నేలగూలి పెన్వొంటనె 32

"కరుణాకర! యిప్పుడేను - గ్రహియించితి నాతప్పుల
ఆలికి, రాజ్యము కొఱకై - యంగద జెందనునేను
అంగదుఁడే యన్ని నాకు - నతనినోము దేవ!" యంచు
క్షమాభిక్షవేడివాలి - కన్నుమూసె నంతలోన 33

క్షమామూర్తి రామమూర్తి - కన్గొలకుల కరుణజిల్క
మాను మింక శోకమంచు - మంచిగ తారకు జెప్పి
శాస్త్రవిధిగ నపరకర్మ - సరగునగావింపజేసి
అంగదు యువరాజొనర్చె - నప్పుడెతాఁగిష్కింధకు 34

సుగ్రీవుని రాజొనర్చి - సుఖముగ జీవింపుమంచు
జానకమ్మ రోయుటకై - సత్వరమే పూనుమనగ
కోర, నాల్గునెలల గడువు - వారిజబాంధవుని సుతుడు
ప్రస్రవణాద్రిని దినములు - రాజసుతులు గడపిరి 35

అతివలవలలోన జిక్కి - యంతిపురంబున సొక్కి
గడువుదాటినంగాని - కపివరుడటు రాకుండుట
రాముడధిక క్రోధముతో - లక్ష్మణునిం బనిచెనటకు
కినుకమీఱ సౌమిత్రి - కిష్కింధకు నేతెంచి 36

పరమద్రోహి పాపాత్ముడు - ప్లవగేశుండెచ్చటంచు
ఔడుగఱచి సౌమిత్రి - అధరపుటము లదరనఱవ
హనుమదాదులంతబోయి - యాలక్ష్మణురాకదెలుప
మదన జలధి మునిగినయా - మదమత్తుడు సుగ్రీవుడు 37

గడగడలాడుచు వణకి - కాలయముని లక్ష్మణుగన
తామిక్కిలి భయమంది - తారను ముందుగ నసిపె
తారవచ్చి సద్భాషల - వీరమూర్తి లక్ష్మణుని
శాంతింపగజేసితాను - స్వాగతమిడి గొనిపోయె 38

మంత్రివరుల సలహాపై - మత్తువీడి స్పృహ దెలిసిన
కపినేతయు గైమోడిచి - కావుకావు మంచువేడి,
మఱవలేదు మీకార్యము - మఱవలేదు మీమేలును
చిట్టడవింబెట్టినను - గట్టిగ మదిమాటినను 39

సీతమ్మను దెచ్చెనేను - శీఘ్రమ్ముగ మీకొసంగి
నాబాసను బాలింతును - నాదీక్ష ముగింతునంచు
అప్పుడపుడె పిలిపించె - యగచర వరవీరులను
పలుప్రాంతంబుల గల్గిన - ప్లవగసేన గొనిరమ్మనె 40

ఖచరాత్మజుని యాజ్ఞ - కపిసైన్యమంతయు
అర్బుదంబుల సంఖ్య - నటజేరె నంతలో
అర్మిలిని సుగ్రీవుఁ - డాజ్ఞలను వారికిడి
తాను లక్ష్మణుండును - తరలిరి శ్రీరాముకడకు 41

సచ్చరితుండా రాముఁడు - గ్రుచ్చికౌగలించి రవిజు
నెమకబంపు కపివరులను - నఖిలదిశలకిప్పుడే
మనెనొలేదో యింతకు - మహిసుతయన, వెంటనే
గడుపిచ్చి యొక్కనెల - గడువులోన గనిరమ్మని 42

రవిజుడంపె కపివరులను - రామునాజ్ఞతలధరించి
కార్యభారమంత నుంచె - కపినేతగు హనుమపైన
దశరథాత్మజుండిచ్చెను - తనదు ముద్దుటుంగరమును
పవన తనయుచేతికి - భువిజాతకు నిమ్మటంచు 43

ప్రాక్పశ్చిమోత్తరముల - బరువులిడిన పీరులంత
గడువులోన నేతెంచిరి - కనుగొనకయె సీతమ్మను
అల దక్షిణ దిశకేగిన - హనుమరాకకై యందరు
ఎదురు చూచుచుండిరచట - నేమిదోచకుంటచే 44

హనుమదంగద సుషేణాదు - లటు దక్షిణ దిశకేగి
అంబరమంతలు కన్నుల - నందఱును స్వైరియజేసి
వెదకి వెదకి వేసారిరి - విపులాత్మజగానమిని
దప్పికచే నాల్కలపై - దడియారగ వారలంత 45

ఋక్షబిలము బ్రవేశించి - యించు మేలిఫలములదిని
అచ్చటగల జాంబూనద - హర్మ్యములు, వింతలుగని
మధువారిని దప్పద్రావ - మైకములో నెలగడచెను
మరలివచ్చు దారెఱుగక - మగువ స్వయం ప్రభకరుణను 46

దక్షిణ జలధికి దాపున - దరిసి తాము ప్రస్రవణము
జానకిజాడం దెలియం - జాలక వెనుదిరిగినచో
అతికోపనుడిన తనయుడు - హతమార్చుట నిక్కమంచు
ప్రాయోపవేశమునకు - బ్రతిన బూన నంగదుఁడు 47

జరిగిన ???నుఘట్టములకు - జటాయువు మరణమునకు
వంత మిగుల కపివీరులు - యెంత గానొ విలపింపగ
వేలకొలది యేండ్లుగ - వికలాంగత గొండనేడ్చు
సంపాతి చెప్పెనపుడు - సకలమ్మును రావణుకథ 48

పోయిన ఱెక్కలు మొలవగ, - బోయెనెగిరి సంపాతి

సంద్రమెట్లు దాటుటంచు - చాల విచారమ్ము కలిమి
అంగదుడధ్యక్షుఁడుగా - నందఱు సభగూడి యపుడు
వారివారి బలశక్తులు - వేఱువేఱ దెలిపికొనిరి 49

ఒకడేనియు లేడచ్చట - నొకదూకున జలధిదాట
వృద్ధజాంబవంతుడపుడు - ప్రేరింపగ వెంటనే
వజ్రతులిత కాయుఁడు - వార్ధిలంఘన దక్షుడు
మహిమాన్విత తేజుడైన - మారుతీ నందనుఁడు 50

తనబలమును గుర్తెఱుగుచు - హనుమానుడు దాకెరతి
పెంచెతనదు దేహమ్మును - బెంచిపెంచి నింగిముట్టె
అల తన మగటిమి గుఱుతుగ - నల్లలనార్చెను వాలము
అందరధిక మోదమ్మున - హనుమకు బలికిరి జేజేలు 51

ధీమంతుడు హనుమంతుడు - దిగ్గున బెద్దల కెఱఁగి
ఇడికించెద బర్వతముల - నుడికించెద సాగరముల
అడగించెద మేఘమ్ముల - మడియించెద రక్కసులను
ఎదిరించెద స్వయంభువుని - యదలించెద హరినైనను 52

ఆలంబన మింతలేక - యంబరమున బయనించెద

జొచ్చెద లంకాపురమున - దెచ్చెద సీతమ్మజాడ
ఖండించెద దశకంఠుని - కలిపెద లంకను జలధిని
వీడుడి చింతల మదిలో - గూడుడి ముదమెదననుచు 53

ప్లవగతతులు తనవెంటనె - పరుగులిడుచు తోడురాగ
హనుమయెక్కె మహేంద్రాద్రి - నఖిలాశల వెలిగించుచు
అతని పాదతాడనమున - నాకాశము మార్మ్రోగగ
ప్రళయకాల రుద్రుగతిని - పవనసూతి భాసిల్లె 54

ఇది శ్రీహనుమచ్చరణారవింద మిళిందాయమాన మనోవైభవ, ధూళిపాళ శంకరయ్య రత్నమ్మల తనూభవ, సుజన విధేయ, కళాసరస్వతి, నాటకకళా ప్రపూర్ణేత్యాది బిరుదాంకిత సీతారామశాస్త్రి ప్రణీతంబైన గేయరామాయణ కావ్యమందు కిష్కింధా కాండము

శ్రీ హనూమద్రామార్పణమస్తు

శ్రీ శ్రీ శ్రీ